ప్రజాశక్తి

బుధవారం 22 అక్టోబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆర్‌డిఒ, డిఆర్‌ఒలపై బదిలీ వేటు

శ్రీలేఖ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం



బదిలీ వేటు పడిన ఆర్‌డిఒ శ్రీలేఖ, డిఆర్‌ఒ భవానీ శంకర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాదాలకు కేంద్ర బిందువైన విశాఖపట్నం ఆర్‌డిఒ శ్రీలేఖ ఎట్టకేలకు బదిలీ అయ్యారు. ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్.భవానీ శంకర్‌ను కూడా బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. దాదాపు ఏడాది క్రితం విశాఖపట్నం ఆర్‌డిఒగా బాధ్యతలు చేపట్టిన శ్రీలేఖ ప్రారంభం రోజుల నుంచి అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారారు. పలువురిపై కేసులు బనాయించారు. ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ రెవిన్యూ శాఖకు తలనొప్పిని కలిగించారు. ప్రజలను, మీడియా ప్రతినిధులను బెదిరింపులు చేస్తూ వచ్చిన శ్రీలేఖ ఆఖరికి తన ఉన్నతాధికారి డిఆర్‌ఒపై కూడా తిరుగుబాటు జెండా ఎగురవేశారు. పెందుర్తి మండలం చినముషిడివాడ దళితవాడలో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడానికి తహశీల్దార్, ఆర్‌ఐ వంటి ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి చట్ట విరుద్ధంగా వ్యవహరించారు. దీనికి సంబంధించిన వివాదం కోర్టులో ఉంది. అయినప్పటికీ మరోసారి ఆ స్థలం తనదని చెబుతున్న ఒక వ్యక్తికి కొమ్ముకాస్తూ అంబేద్కర్ విగ్రహం తొలగింపునకు ఆమె యత్నించినట్లు చెబుతుంటారు. దీనిని ప్రతిఘటించిన ఒక ప్రజా సంఘం కార్యకర్తలు, కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి కోర్టు వివాదం ఉండగా తొందరపాటు చర్య ఎందుకు తీసుకున్నారని ఆర్‌డిఒను మందలిచారు. ఈ నేపథ్యంలో డిఆర్‌ఒ భవానీ శంకర్ తన పరిధిలో ఉన్న తహశీల్దారులు, ఆర్‌ఐ వంటి ఉద్యోగులను ఒక్కొక్క మండలానికి నెలకు రూ.20 వేలు ఇవ్వాలని అడిగినట్లు, ప్రోటోకాల్ ఖర్చులు, ఇతర ఖర్చులు అధికంగా ఉన్నాయని ఆయన చెప్పినట్లు ఆరోపిస్తూ మిగతా 2లో..

భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా జరగనున్న భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. జెసి కె.మయూర్ అశోక్, సిఐఐ ప్రతినిధులు, నిర్వాహకులు, జిల్లా అధికారులతో కలిసి మంగళవారం సాయంత్రం తన ఛాంబర్‌లో ప్రత్యేకంగా సమావేశమైన ఆయన వివిధ అంశాలపై చర్చించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన కార్యక్రమం కావున అందరూ అప్రమత్తంగా ఉండాలని, అప్పగించిన విధులను అత్యంత బాధ్యతగా నిర్వర్తించాలని నిర్దేశించారు. ఎక్కడా ఎలాంటి లోపాలూ తలెత్తకుండా సిఐఐ మిగతా 2లో..

డిసెంబర్ 9 నుంచి విశాఖ బాలోత్సవం



మాట్లాడుతున్న రఘు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ ఏడాది డిసెంబర్ 9 నుంచి 11 వరకు నగరంలోని సెయింట్ ఆంథోనీ ఓల్డ్ ప్రైమరీ తెలుగు మీడియం స్కూల్‌లో విశాఖ బాలోత్సవం - 2025 జరుగనుంది. ఈ మేరకు ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పిల్లలమర్రి రఘు అధ్యక్షతన జరిగింది. విసిసి నాయకురాలు డాక్టర్ కె.రమాప్రభ బాలోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. విశాఖ బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జివిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ 2023లో మొదటిసారి బాలోత్సవాన్ని నిర్వహించామని, అందులో ఆరు వేల మంది పిల్లలు 84 ఈవెంట్లలో పాల్గొన్నారని, 2024 బాలోత్సవంలో ఎనిమిది వేల మంది పిల్లలు పాల్గొన్నారని, ఈ సంవత్సరం జరిగే మూడో బాలోత్సవంలో మరింత ఎక్కువ మంది పాల్గొంటారని భావిస్తున్నామని తెలిపారు. ఈసారి విశాఖ బాలోత్సవాన్ని విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం 2025 విశాఖ బాలోత్సవం ఆహ్వాన సంఘం సభ్యుల పేర్లను ఆయన ప్రతిపాదనకు పెట్టారు. ఆహ్వాన సంఘం గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఉండడానికి విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిఇఒ ఎన్.ప్రేమ కుమార్ అంగీకరించారని తెలిపారు.

ఆహ్వాన సంఘం

ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా విశాఖ వ్యాలీ రోటరీ ట్రస్ట్ చైర్మన్ ఎం.జానకిరామ్, అధ్యక్షులుగా పి.రఘు, ప్రధాన కార్యదర్శిగా జివిఎస్.రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బేతవోలు రామబ్రహ్మం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సెయింట్ ఆంథోనీ స్కూల్ కరెస్పాండెంట్ పి.రత్నకుమార్, కన్సర్న్ ట్రస్ట్ చైర్మన్ పి.కె.జోస్, ఆసరా ఛారిటబుల్ సొసైటీ ప్రతినిధి సి.సునీతతో పాటు మరో 15 మంది గౌరవ సలహాదారులుగా, నగరంలోని ప్రముఖ డాక్టర్లు, లాయర్లు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు, ప్రైవేట్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, జెవివి, టీచర్స్, విసిసి తదితర సంస్థలకు చెందిన మరో 32 మంది ఉపాధ్యక్షులుగా, కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

▶ వార్త 3లో..

కొయ్యూరు జెడ్‌పిటిసి హత్య

▶ వార్త మెయిన్‌లో..

యూరియా కొరతతో రైతన్నల అగచాట్లు

▶ వార్త 5లో..

పేదలు, అనాథలకు

రూ.60 లక్షల సహాయం అందజేత

కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిహెచ్.నర్సింగరావు, బాషా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 12 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన ట్రేడ్ యూనియన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (టియుఎస్ఆర్) ద్వారా కోరమండల్ ఫెర్టిలైజర్స్ కర్మాగారం, చుట్టుపక్కల ప్రాంతాలలో ఉన్న పేదలకు, అనాథ లకు నేటి వరకూ రూ.60 లక్షలను వివిధ రూపాలలో సహాయంగా అందజేసినట్టు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.బాషా తెలిపారు. మంగళవారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థలో పనిచేస్తున్న 350 మంది ఉద్యోగులు ప్రతి నెలా రూ.50 విరాళంగా అందజేసే విధంగా టియుఎస్ఆర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 2013లో ఏర్పాటు చేసిన ఈ సంస్థను అప్పటి జిల్లా కలెక్టర్ శేషాద్రి ప్రారంభించారని చెప్పారు. ప్రారంభించిన మొదటి సంవత్సరం సంస్థ తరపున చేపట్టిన సేవా కార్యక్రమాలను చూసి యాజమాన్యం స్పందించి ఉద్యోగులతో సమానంగా యాజమాన్యం కూడా ఒక్కొక్క ఉద్యోగికి రూ.50 చొప్పున లెక్కించి టియుఎస్ఆర్‌కు జమ చేస్తూ మిగతా 2లో..

ప్రముఖ వ్యాపారవేత్త

చందన మోహనరావు కన్నుమూత

◆ వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు సంతాపం ◆ గౌరవ సూచికంగా వస్త్ర వ్యాపార సంస్థలు మూసివేత



చందన మోహనరావు (ఫైల్)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వ్యాపార దిగ్గజం, చందన బ్రదర్స్, సిఎంఆర్ వ్యవస్థాపకులు చందన మోహనరావు (82) ఇక లేరు. కొంత కాలంగా అస్వస్థతకు గురై బాధపడుతున్న ఆయన సోమవారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ప్రముఖ వ్యాపారవేత్తలు ప్రజాప్రతినిధులు సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నగరంలోని వస్త్ర వ్యాపార దుకాణాలన్నీ మూసివేసి సంతాపం ప్రకటించారు.

అంచెలంచెలుగా ఎదిగి..

1943లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జన్మించిన మోహనరావుకు ఐదుగురు అన్నదమ్ములు, నలుగురు అక్క చెల్లెల్లు. మోహనరావుకు సుబ్బలక్ష్మితో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమారైలు. చిరు ఉద్యోగిగా తన కెరీర్‌ను ప్రారంభించి, చిన్ననాటి నుంచి వ్యాపార రంగంపై ఉన్న ఆసక్తితో మొదటిసారిగా 1972లో హోల్ సేల్ వ్యాపారాన్ని ఆయన ప్రారంభించారు. రామచంద్ర క్లాత్ షోరూమ్ ప్రారంభించి, ఆ తర్వాత 1982లో చందన కంచి శారీస్ పేరుతో రాజమహేంద్రవరంలో మరొక వ్యాపారాన్ని ఆరంభించారు. తన సోదరులను కూడా వ్యాపార రంగంలో తనతో పాటు అభివృద్ధి చెందేలా ప్రోత్సహించిన మహోన్నత వ్యక్తిగా ఆయనకు పేరుంది.

విశాఖపట్నంలో మొట్టమొదటి సారిగా 1984లో జగదాంబ జంక్షన్‌లో చందన బ్రదర్స్ పేరుతో నూతన వస్త్ర వ్యాపారాన్ని ఆరంభించారు. హోల్ సేల్ రేట్లకే రిటైల్ అమ్మకం అనే కొత్త విధానాన్ని, వస్త్ర వ్యాపార రంగంలో ప్రవేశపెట్టారు. అప్పటివరకూ కనీవిని ఎరుగని రీతిలో వస్త్రాల కొనుగోలుపై ఎక్స్ఛేంజ్ ఆఫర్ విధానాన్ని కూడా మొట్టమొదటిసారిగా పరిచయం చేశారు. నాటి నుండి వ్యాపారంలో నూతన వరవడిని కొనసాగించారు. 1988లో చందన బ్రదర్స్ హైదరాబాదులో, 1989లో విజయవాడలో శాఖలను ప్రారంభించారు. 1998లో జ్యూయలరీ రంగంలో అడుగిడి తర్వాత మొట్టమొదటి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

చందన మోహనరావు కన్నుమూత

హాల్ మార్క్ బంగారు ఆభరణాలను తెలుగు రాష్ట్రాలకు పరిచయం చేశారు. పొగడ్తలు అంటే ఏమాత్రం ఇష్టపడని మోహనరావు తన పేరు మీద వ్యాపారం ఆరంభించడానికి కూడా విముఖత చూపేవారు. అయినప్పటికీ ఆయన అల్లుడు మావూరి వెంకటరమణ ప్రోద్బలంతో సిఎంఆర్ షాపింగ్ మాల్ పేరుతో నూతన మాల్ ఆరంభించడానికి అంగీకరించి 2002లో విశాఖపట్నంలో సిఎంఆర్ షాపింగ్ మాల్ పేరుతో మొట్టమొదటి షాపింగ్ మాల్ ప్రారంభించారు. నగరానికి ఒక తలమానికంగా ఇది నిలిచింది. మొట్టమొదటిసారిగా తెలుగు రాష్ట్రాలలోనే షాపింగ్ మాల్ అనే విధానాన్ని పరిచయం చేసిన ఘనత కూడా దీనితోనే ఆరంభం అయింది. మోహనరావు స్ఫూర్తితో, ప్రోద్బలంతో మావూరి వెంకటరమణ ఆధ్వర్యంలో దినదిన ప్రవర్ధమానమై సిఎంఆర్ గ్రూపు నాలుగు రాష్ట్రాలలో (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక)ల్లో శాఖోపశాఖలుగా విస్తరించి ప్రజాభిమానంతో వర్ధిల్లుతోంది. వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఎన్నో వేల కుటుంబాలకు ఉపాధి దక్కేలా చేసింది. సిఎంఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అనేకమంది పేద విద్యార్థులకు విద్యాదానాన్ని కొనసాగిస్తోంది. అవసరంలో ఉన్నవారికి అన్నీ తానే ఆదుకున్న మహోపకారి, మృధు స్వభావి, వస్త్ర వ్యాపార రంగంలో ఎన్నో వేల మందికి ఆదర్శప్రాయంగా నిలిచిన అత్యున్నత వ్యక్తిగా మోహనరావును చెప్పుకుంటారు. ఆయన అంత్యక్రియలు సోమవారం ఆనందపురంలో జరిగాయి. నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు మోహనరావు మృతికి సంతాపం తెలిపారు. ఆయన అల్లుడు మావూరి వెంకటరమణను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఆర్‌డిఒ, డిఆర్‌ఒలపై బదిలీ వేటు

ఆర్‌డిఒ శ్రీలేఖ ఆయనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనికి సంజాయిషీ కోరుతూ కలెక్టర్ వారిద్దరికీ నోటీసులు ఇచ్చారు. ఈ వివాదం కాస్త తీవ్ర స్థాయికి చేరడంతో కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక పంపడం, సిఎస్ స్పందించడం చకచకా జరిగిపోయాయి. తుదకు ఇద్దరిపై బదిలీ వేటు పడింది. వారిని జిఎడికి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

భాగస్వామ్య సదస్సుకు పటిష్ట ఏర్పాట్లు

ప్రతినిధులతో సమన్వయం వహించుకోవాలని అధికారులకు సూచించారు. 13 సాయంత్రం నుంచి అన్ని రకాల కార్యకలాపాలు మొదలవుతాయని, 14, 15 తేదీల్లో ప్రధాన ఈవెంట్లు జరుగుతాయని పేర్కొంటూ దానికి తగ్గట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రూ.60 లక్షల సహాయం అందజేత

వస్తోందన్నారు. 12 సంవత్సరాలుగా విశాఖపట్నం, చుట్టుపక్కల ప్రాంతాలలో టియుఎస్‌ఆర్ పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వచ్చామని చెప్పారు. ప్రతి ఏటా కోరమండల్ ప్రాంగణంలో వికలాంగులకు ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, అంధ పాఠశాలల పిల్లలకు ప్రత్యేక అవసరాలు, అనాథ పాఠశాలల పిల్లలకు విద్యా పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు, ప్రభుత్వ పాఠశాలల మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, చెవిటి, మూగ వారికి వినికిడి పరికరాలు, కుట్టు యంత్రాలు, అనాథ గృహానికి భవన నిర్మాణ సామగ్రి, వృద్ధాశ్రమాలకు ఆహారం, కిరాణా సామగ్రి, అంతేకాకుండా పరిసరాల్లోని పేదలకు అనేక వస్తువులను విరాళంగా ఇస్తూ వస్తున్నట్లు చెప్పారు. గత ఏడాది వరకు టియుఎస్‌ఆర్ కార్యక్రమాల ద్వారా 250 ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, ఇతర వస్తువులు పంపిణీ చేసినట్లు చెప్పారు. టియుఎస్‌ఆర్ కార్యకలాపాలతో యూనియన్ ప్రతి ఏటా ప్లాంట్ ప్రాంగణంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తూ వస్తోందని చెప్పారు. ఈ ఏడాది టియుఎస్‌ఆర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ హాజరవుతున్నట్లు తెలిపారు. యూనియన్ అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ కార్మిక సంఘం అయినప్పటికీ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిందన్నారు. యూనియన్‌ను మిగిలిన కార్మిక సంఘాలు కూడా ఆదర్శంగా తీసుకొని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉందన్నారు.

ఆర్‌టిసిలో ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ ఆర్‌టిసి విశాఖ జిల్లాలో సిబ్బంది ఉద్యోగోన్నతులకు సంబంధించి వివిధ కేటగిరీలలో 572 సిబ్బందికి ప్రమోషన్ ఇచ్చేందుకు జాబితా సిద్ధమైందని రీజినల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మీడియాకు తెలిపారు. ప్రమోషన్లు పొందనున్న వారిలో 27 మంది ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, మెకానికల్ సూపర్‌వైజర్లు, 113 మంది ఎడిసిలు, 115 మంది కండక్టర్లు, 130 మంది గ్రేడ్ వన్ డ్రైవర్లు, 167 మంది గ్రేడ్ వన్ మెకానిక్‌లు, అలాగే ట్రిమ్మర్స్, కోచ్ బిల్డర్లు, పెయింటర్లు వివిధ 23 కేటగిరీలలో ప్రమోషన్లు పొందనున్నారని తెలిపారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఇన్నర్ వీల్ క్లబ్‌కు అనుబంధ శాఖ అయిన ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేరు ఆధ్వర్యంలో సాగర్‌నగర్ అర్బన్ పిహెచ్‌సిలో 11 నుండి 21 సంవత్సరాల వయస్సుగల బాలికల కోసం మంగళవారం ఉచిత గర్భాశయ గర్భద్వార కేన్సర్ అవగాహన టీకా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గర్భాశయ గర్భద్వార కేన్సర్ దేశంలో మహిళల్లో రెండో అత్యధికంగా కనిపించే వ్యాధిగా ఉందన్నారు. హెచ్‌పివి వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ జిల్లా చైర్మన్ అరుణశ్రీ, క్లబ్ అధ్యక్షురాలు ఎం.స్వాతి, క్లబ్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ ప్రసూన, అశోక కుమారి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు అద్దెబస్సు డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: అద్దెబస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని వాల్తేర్ డిపోలో అద్దె డ్రైవర్ల సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టి ఆర్టీసీ అధికారులు, అద్దె బస్సు యజమానులు గాని చర్చలకు ఆహ్వానించి డిమాండ్స్ పరిష్కరించడంలో ముందుకు రావటం లేదని విమర్శించారు. ఇప్పటికే మద్దిలపాలెం, సింహాచలం డిపోల్లో అద్దె బస్సు డ్రైవర్లు వేతనాలు పెంచాలని ధర్నాలు చేసి వినతిపత్రాలు ఇచ్చారని జిల్లా వ్యాప్తంగా అద్దెబస్సు డ్రైవర్ల జీతాలు పెంచి డిమాండ్స్ ఆమోదించకపోతే అన్ని డిపోల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్‌కి 8 గంటల డ్యూటీకి 1000 జీతం చెల్లిస్తే, అదే డ్రైవర్ డ్యూటీ చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు మాత్రం రూ.600 మాత్రమే చెల్లిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అద్దె బస్సు యజమానులు చర్చలకు వచ్చి వేతనాల పెంపుతో పాటు ఇతర డిమాండ్స్ ఆమోదించాలని లేనిపక్షంలో ఆర్టీసీ ఆర్.ఎం ఆఫీసు, లేబర్ ఆఫీస్ వద్ద ధర్నాలు నిర్వహించి సమ్మెను మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్టిసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మద్దిలపాలెం జోన్ గౌరవ అధ్యక్షులు పి.వెంకటరావు, హైర్‌బస్ డ్రైవర్స్ అసోసియేషన్ వాల్తేర్ డిపో అధ్యక్షుడు, కార్యదర్శులు బి.జంపన్న, పి.రఘు, మద్దిలపాలెం డిపో అధ్యక్ష కార్యదర్శులు జె.కృష్ణ, సిహెచ్.తేజ అద్దె బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: జివిఎంసిలో విలీనం కాబడిన 32 పంచాయతీల కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసిగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల ప్రకారం విలీన పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. 2005లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జివిఎంసిగా ఏర్పాటైన సందర్భంలో 32 గ్రామ పంచాయతీలు, గాజువాక మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికులను 2005 నవంబర్ 21న విలీనం చేశారని, 2006 జూలై వరకు నేరుగా జోనల్ కమిషనర్లు వీరికి వేతనాలు చెల్లించేవారన్నారు.

దీనిని యాజమాన్యం కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో అంగీకరించిందని ఆధారాలను జివిఎంసి అధికారులే ధ్రువీకరించి 593 మంది కాంట్రాక్టు కార్మికుల జాబితాలను, అధికారులు ఇచ్చిన సర్వీస్ సర్టిఫికెట్లు, ప్రతి సంవత్సరం వీరిని కొనసాగించటానికి అనుమతి కోరుతూ పంపిన లేఖలు, జెసిఎల్ వద్ద జరిగిన ఒప్పందాలు, మినిట్స్ ఈ కార్మికుల పేరుతో ఉన్నాయని తెలిపారు.

అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జివిఎంసి కమిషనర్, మేయర్‌లకు అందించామన్నారు. ఇప్పటికైనా కోర్టు ఆదేశాల ప్రకారం వీరికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, లేకుంటే ఆందోళన ఉదతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి. వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, జె.ఆర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన అదనపు ఫ్యామిలీ కోర్టు విశాఖపట్నం
ఎఫ్.సి.ఒ.పి.నెం.61/2024

బిట్వీన్:
శ్రీమతి గట్టు సుధారాణి . . . వాది
మరియు:
గట్టు సామ్యుల్ . . . ప్రతివాది

నోటీసు

టు:
గట్టు సామ్యుల్ తండ్రి లేటు డానియెల్ డోర్ నెం.4-59-261/1, క్రిష్టియన్ వీధి, జ్యూట్‌మిల్ దరి, చిట్టివలస, భీమునిపట్నం మండలం, విశాఖపట్నం-531162.

పై నెంబరు గల ఎఫ్‌సిఒపి నెం. 61/2024 విడాకుల కొరకు దాఖలు చేసుకున్న దావాలో మీహాజరు నిమిత్తము ఎన్నిపర్యాయములు మహారాజశ్రీ కోర్టు వారు సమన్లు జారీ చేసియున్నప్పటికీ ఉద్దేశ్య పూర్వకముగా మీరు కోర్టువాయిదాలకు హాజరు కాలేనందున మహారాజశ్రీ కోర్టువారు అనుమతి మేరకు ఈనోటీసును పత్రికా రూపేణా మీకు తెలియజేయునది ఏమనగా **తేది 28-11-2025 నాడు ఉదయం 10.30 ని॥లకు** సదరు పైన ఉదహరించిన కోర్టులో కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని హాజరు కావలెను. లేని యెడల మీ పరోక్షమున కోర్టు ఇచ్చిన తీర్పునకు బాద్యులు అగుదురు.

కోర్టు వారి ఉత్తర్వులు మేరకు
సరగడ సురేష్‌రెడ్డి
వై.జ్యోతి విజయ
న్యాయవాదులు, విశాఖపట్నం
విశాఖపట్నం
తే:21-10-2025
సెల్: 98660 21720

PUBLIC NOTICE

The Public in general are hereby informed that my client GAANNIMANI VEERABHADRA RAO S/O GANNIMANI DORAIAH (Late) residing at 2-48-24/1/4, Plot No.202, Akshaya Apartment, M.V.P.Colony, Visakhapatnam Visakhapatnam intends to purchase the below mentioned schedule property from its owners, Sundaraneedi Satya W/o late Venkata Nageswara Rao residing at D.No 53-7-1/1, ramalayam street Maddilapalem, Visakhapatnam into a sale agreement Dt.6-10-2025 which, was acquired under document No 4036/2004. Therefore, if there are any objections regarding sale of the schedule mentioned property, they are required to put forth and send their objections with all documentary or any other proof before the below mentioned address and take proper acknowledgement in writing within a week day from the date of this publication. If no such objections are received within the stipulated one week's time, it shall be deemed there are no objections and my client will proceed with sale transaction and any objection subsequently raised shall not stand in the court of law.

SCHEDULE: All that part and parcel of the land measuring an extent of 200 sq yards covered by S.Nos 329 situated at surya Sakthi nagar vuda approved lay-out Plot No 125 Madhurawada, [P M palem] Visakhapatnam District within the limits of Greater Visakhapatnam Municipal Corporation and Madhurawada Sub-registry and bounded by :
East: 40 feet wide road **South:**plot No.126
West: plot No.124 **North:** 40 feet wide road.

Advocate
K.H V.A.NAIDU, B.com. B.L.
ADVOCATE & NOTARY
5-5-6. Gavara Veedhi,
Vizianagaram-535001
Cell: 9490159931
Cell: 8978978697
Ph.. 08922-233107

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 250/2014 E.P.No. 9/2021

వాది/పిటిషనరు/డి.హెచ్.ఆర్:
అనిమిరెడ్డి సత్యనారాయణ **(Died)** వగైరాలు
ప్రతివాది/రెస్పాన్డెంట్/జె.డి.ఆర్:
అనిమిరెడ్డి రమాదేవి

వేలం ప్రకటన

పై నెంబరు దావాలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తము ఇందలి ప్రతివాది/రెస్పాన్డెంట్/జె.డి.ఆర్. యొక్క అమలు షెడ్యూలు దాఖలా ఆస్తిని వేలం వేయించవలసినదిగా వాది/పిటిషనరు/డి.హెచ్.ఆర్. కోరుతూ పై అమలు గ్రంధమును దాఖలు చేయగా సదరు అమలు గ్రంధము వేలం నిమిత్తం తే:06-11-2025 దిన వాయిదా అయి యున్నందున వేలంపాట యందు పాడుకొనదలచినవారు **తే:06-11-2025దీన ఉదయం 10-30 గంటలకు** పై తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై శ్రీకోర్టు వారు జరుపు బహిరంగ వేలంపాట నందు పాల్గొని వేలం షరతులకు లోబడి పాడుకొన వచ్చును. ఇంకను ఇతర వివరముల కావలసిన యెడల పై కోర్టులో డిప్యూటీ నాజర్ వారి కార్యాలయంలో గాని లేదా ఈ దిగువ తెలిపిన డిక్రీ హోల్డర్ యొక్క న్యాయవాదిగారి కార్యాలయంలో అడిగి తెలుసుకొనవచ్చును.

షెడ్యూలు

Visakhapatnam District Narsipatnam Sub Division Narsipatnam Sub Registrar Makavarapalem Mandal, Kondala Agraharam Panchayat and village, RCC slab Ground and First Floor Building along with Compound Wall in an extent of Ac. 0-88 cts or 4259.2 Sq.feet or 356.069 mts (Ground Floor) 2362.9 Sq. ft. or 219.749 Sq.mts. and (First Floor) 2362.9 Sq. ft or 219.49 Sq. mts having boundaries as follows:
East: Dry land of Gavireddy Venkunaidu and others,
South: Palmyrah Hedge of Gavireddy Venkunaidu,
West: Dry land of Bobbili Ayyalu,
North: Dry land of Surla Pentayya and others.
D.hr. Value: Rs. 6,00,000-00
Amin Value: Rs. 50,000-00
Market Value: Rs. 6,00,000-00

వేలం తేదీ: 06-11-2025

మెట్ట ప్రభాకర్,
న్యాయవాది
నర్సీపట్నం.
నర్సీపట్నం.
తే:21-10-2025
సెల్: 8179154586, 7989015974

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT AND SESSIONS JUDGE AT VISAKHAPATNAM
I.A.No. 2405/2025 IN A.S. No. /2025

Between:
Gongada Padmanathi and others . . . Appellants
And:
Mahatarunnisa Begum and others . . . Respondents
To
R1: Mahatarunnisa Begum, W/o Shaik Madeena, Islam, Aged about 60 years, Housewife, R/o D.No.10-12-51, South Jail, Visakhapatnam.
R2: Annamneedi Naga Vara Prasada Rao, S/o Late Ganga Raju, Hindu, Aged about 62 years, R/o D.No.7-6-41, Chengalraopeta, Visakhapatnam
R3: Moka Satyanarayana Murthy, S/o Late Ramamurthy, Hindu, Aged about 63 years, R/o.D.No.51-10-32, Old Gajuwaka, Visakhapatnam
R4: Annamneedi Sree Ram Chandra, S/o Pattabi Ramayya, Hindu, Aged about 65 years, R/o D.No.25-65-1/2, Muralinagar, Visakhapatnam
R5: Moka Veera Venkata Rao, S/o Kondayya Naidu, Hindu, Aged about 65 years, R/o D.No.52-17-2/21, Old Gajuwaka, Visakhapatnam

NOTICE

Please take summons that the above named appellant preferred an appeal against the respondents to set aside the decree and judgement passed in OS.944/2010 dated 23.3.2023 by the Honourable Principal Senior Civil Judge, Visakhapatnam and decree the suit and for other reliefs, and the same stands posted to **31-10-2025** for your appearance on that day at **10-30 AM.** You should appear before the aforesaid Honourable Court either in person or through an advocate without fail, else the matter will be determined in your absence exparte.

N.SESHU KUMAR
Advocate, Flat No.203 & 204
R.K. Towers, Krishna Gardens,
Visakhapatnam. Cell:9347379739

IN THE HON'BLE COURT OF VI ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF VISAKHAPATNAM
O.S. No.832/2017

Between:
Veeramalla Visweswara Rao . . . Petitioner/Plaintiff
And:
Veeramalla Koteswara Rao and others . . . Defendents
To
D-7: Damarasingi Venkata Ravi Shankar Kumar, S/o. late Prasada Rao Hindu Aged 42 years, R/o. D.No.6-14-3, Surya Enclave, East Point Colony, Visakahapatnam.
D-8: Damarasingi Venkata Naga Aruna Lakshmi, D/o. late Prasada Rao Hindu Aged 39 years, R/o D.No.6-14-3 Surya Enclave, East Point Colony, Visakahapatnam.
D-9:J Damarasingi Usha Naga Rani D/o. Late Prasad Rao, Hindu, aged 33 years, R/o D.No.6-14-3, Surya Enclave, East Point Colony, Visakhapatnam.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you. You are hereby summoned to appear in the above Court in person or through a pleader duly instructed, and the matter stands posted to **11-11-2025 at 10:30 AM** for your appearance in default of your appearance on that day the suit will be heard and deter-mined in your absence based on the material zavailable in the Court.

B.V.R.MURTHY (BABU)
Advocate, D/4 Deepanjali Apartments,
Besides Lotus Hospital, Waltair
Uplands. Visakhapatnam-530 003,
e-mail bvimbabu@gmail.coms
Cell: 98491 24102

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం.77/2011 ఐ.ఎ.నెం.385/2025

బిట్వీన్ :
బొబ్బర అప్పలనాయుడు (డైడ్) వగైరాలు
...పిటీషనర్లు (వాదులు)
మరియు
రెడ్డి అప్పలకొండ (డైడ్) వగైరాలు
...రెస్పాండెంట్లు
టు
రెడ్డి సత్యవతి భర్త సత్యన్నారాయణ రామన్న పాలెం గ్రామము, చోడపల్లి శివారు, అచ్యుతాపురం మండలము, అనకాపల్లి జిల్లా.

పై నెంబరు దావాలో పిటిషనర్లు (వాదులు) ఈ కోర్టులో నిన్ను మైనర్లు రెడ్డి వరహా వెంకట మౌళి తండ్రి లేటు సత్యన్నారాయణ, రెడ్డి వర్ష రోహిణి తండ్రి లేటు సత్యనారాయణ, సా॥రామన్న పాలెం, చోడపల్లి శివారు, అచ్యుతాపురం మండలము కు ఈవాజ్యమనకు సంబంధించినంత వరకు, గార్డియన్‌గా నియమించమని కోరుతూ ధరఖాస్తు దాఖలు చేసినారనిన్ని సదరు ధరఖాస్తు 2025వ సం॥10వ నెల 29వ తేదీన విచారణకు కలవని తెలియ జేయడమైనది. సదరు పై మెనర్లుకు గార్డియనుగా వుండుటకు సమ్మతించిన యెడల పై కోర్టుకు పై విచారణ తేదీన హాజరు అయి సమ్మతిని తెలుపగలరు. సదరు విధంగా తెలియజేయని ఎడల కోర్టు వారు వేరే తగువారిని ఈ వాద్యమునకు సంబంధించినంత వరకు పై మైనర్లుకు గార్డియనుగా నియమించుటకు సివిల్ ప్రొసీజరు కోడు యొక్క 32 రూలు క్రింద గ్రంధము జరుపుదురు అని తెలియజేయడమైనది .

(శ్రీ కోర్టు వారి ఉత్తరువుతో)
(వాడపల్లి అన్నపూర్ణయ్య
అడ్వకేటు, యలమంచిలి
యలమంచిలి
తే.19-10-2025 సెల్ : 9247159149.

అదాని సిమెంట్ అనుమతులు రద్దు చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అదాని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దుచేయాలని వక్తలు డిమాండ్ చేశారు. జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లో గ్రామ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పోరాట కమిటీ చైర్మన్ డాక్టర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలు చర్మ, శ్వాస కోస, ఊపిరితిత్తులు, కేన్సర్ లాంటి భయంకర వ్యాధులతో తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. సిమెంట్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజలందరూ పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ, ప్రజలు అభిప్రాయమే తుది నిర్ణయం అవుతుందని, దీనికి తాను కూడా వ్యతిరేకంగా ఉన్నానని చెప్పారు. ఎమ్మెల్యేతో మాట్లాడి సిమెంట్ ఫ్యాక్టరీ జనాల మధ్య ఏర్పాటుచేయకుండా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. జనసేన నాయకులు ముమ్మన మురళి, సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, వైసిపి నాయకులు మంత్రి శంకర్‌నారాయణ మాట్లాడుతూ, ఇప్పటికే గంగవరం పోర్టు కాలుష్యం, డంపింగ్ యార్డు వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పుడు సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టడం అన్యాయమని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రెండోసారి ప్రజా అభిప్రాయ సేకరణ చేయకూడదని కోరారు. అలా కాకుండా ముందుకెళితే ప్రతి ఇంటి నుండి ఇద్దరు చొప్పున వచ్చి అభిప్రాయ సేకరణను అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వి.నారాయణరావు, డి.రమణ, భాస్కరరావు, రమేష్, రామచంద్రనగర్, రిక్షా కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న రమేష్ కుమార్, రాంబాబు, గంధం శ్రీనివాసరావు

కృష్ణంరాజుపేటలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-తగరపువలస : భీమునిపట్నం మండలం సింగనబంద పంచాయతీలో వికాస సమితి ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణంరాజుపేట, డొకరపేటలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రాంత సంయోజిక్ తిరుపతయ్య, విశాఖపట్నం జిల్లా సంయోజిక్ గాడు వెంకటప్పుడు మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరారు. ప్లాస్టిక్ వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాడు వెంకటనారాయణ, సురాల వెంకట్రావు, అప్పలరాజు, జి.గుడ్డాల ఎల్లయ్య, గాడు తాతినాయుడు, కనకల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిమ్సర్ ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-మధురవాడ : ఆస్టియోఫోరోసిస్‌గా పిలిచే ఎముకల వ్యాధిపై గీతం ఆసుపత్రి (జిమ్సర్) ఆధ్వర్యంలో బుధవారం గీతం ఆసుపత్రిలోని తమ విభాగంతో పాటు నగరంలోని పెదజాలరిపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలోనూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ హరీష్ తెలిపారు. ఉచితంగా ఎముకల పటుత్వ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తే చర్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ : నగరంలోని వ్యాపారులు, వాణిజ్య సముదాయాలలో దుకాణాల ముందు డస్ట్ బిన్లు తప్పనిసరిగా ఉపయోగించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని, లైసెన్సులు రద్దు చేయడంతో పాటు తగిన జరిమానాలు విధిస్తామని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ హెచ్చరించారు. జోన్-2లోని 11, 12, 13 వార్డుల పరిధి ఆరిలోవ బాలాజీ జంక్షన్, శాంతినగర్ కొండ ప్రాంతం, దుర్గా బజారులోని అన్నా క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఆరిలోవ బాలాజీనగర్‌లో మాంసం దుకాణం, పూల వ్యాపారులు వ్యర్థాలను రోడ్లపై వేయడంతో కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యర్థాలను వారిచే తొలగింపజేశారు. ఆరిలోవలోని టిఫిన్ సెంటర్ వద్ద డస్ట్ బిన్ లేకపోవడం గమనించి ఆ టిఫిన్ సెంటర్ యజమాని నుంచి రూ1000 అపరాధ రుసుం వసూలు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. నగరంలో ప్రతి దుకాణం ముందు 3 డస్ట్ బిన్‌లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు.

శాంతిపురం కొండవాలు నివాస ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతాలకు నిత్యం చెత్త తరలించే వాహనాలు సమయానికి వస్తున్నాయా? వ్యర్థాలను విభజించి సిబ్బందికి అందిస్తున్నారా, లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు ఏ సమయానికి వస్తుంది ఎంత సమయం ఇస్తున్నారని, వీధిలైట్లు వెలుగుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు అవంతి విద్యార్థినులు

ప్రజాశక్తి -తగరపువలస : రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీలకు ఎంపికైన అవంతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులకు సంస్థ అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. నెల్లిమర్ల రామకృష్ణ ద్యాన మందిరంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి యోగాసనాల పోటీలకు 150 మంది హాజరుకాగా 43 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వారిలో ముగ్గురు అవంతి కళాశాలకు చెందిన జామి తేజశ్వని, జన్ని నిఖిల, బన్నా నిఖిత ఉన్నారని ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ మురళీకృష్ణ, డైరక్టర్ కె.చంద్రశేఖర్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు.

అయోడిన్ లోపంపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతలు నివారణ దినోత్సవం జరిపారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో అయోడిన్ పాత్రపై అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల పిల్లలు పెరుగుదల, అభివృద్ధిపై అనేక ప్రతికూల ప్రభావాలు ఉంటాయని గర్భిణులు, బాలింతలు, తల్లులు, గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ ఎం.శ్రీదేవి, సూపర్‌వైజర్ జి.శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు కాసులమ్మ, పద్మ పాల్గొన్నారు.

చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జికి ఆమోదం

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి మెట్రో ఆమోదం లభించింది. జివిఎంసి కౌన్సిల్‌లో రూ.3.23 కోట్ల నిధులు మంజూరు కాగా, ఇంజనీరింగ్ అధికారులు టెండర్లు కూడా పిలిచారు. చంద్రంపాలెం స్కూల్‌కు హైవే దాటి వెళ్లే ప్రయత్నంలో విద్యార్థులు సహా అనేకమంది పాదాచారులు ప్రమాదాల బారిన పడడంతో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ తీసుకుని ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయించారు. అయితే బ్రిడ్జి నిర్మాణం వల్ల అదే మార్గంలో ప్రతిపాదించిన మెట్రో రైల్‌కు ఇబ్బంది తలెత్తుతుందని ఆ ప్రాజెక్టు అధికారులు మొదట్లో అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై గంటా శ్రీనివాసరావు మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డికి సమస్య తీవ్రతను వివరించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి కంటే ఎత్తులో మెట్రో డిజైన్ చేయవచ్చని రామకృష్ణారెడ్డికి చెప్పడంతో అందుకు అనుగుణంగానే మెట్రో డిజైన్‌ను ఖరారు చేసినట్టు జివిఎంసి ఇంజనీరింగ్ విభాగానికి తెలియజేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డంకులు తొలగిపోవడంతో విద్యార్థులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : గాజువాకలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూర్మన్నపాలేనికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. కూర్మన్నపాలేనికి చెందిన ఆరుగురు యువకులు విశాఖ బీచ్‌కు రాత్రి 11:30 సమయంలో బయలుదేరారు. ఒకే ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు స్పీడ్‌గా వెళ్తూ డివైడర్‌కు ఢీకొట్టి పడిపోయారు. దీంతో అజయ్ రాజు (17), మనోజ్ కుమార్ (17) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్తున్న భార్యాభర్తలను వ్యాన్ ఢీకొట్టడంతో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త స్వల్ప గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణనాయుడుపేటకు చెందిన పాలిక లక్ష్మణ్ (29) పూలు, పండ్ల వ్యాపారం చేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఆయనకు భార్య పాలిక నూక రత్నం (24), ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో లక్ష్మణ్ తన భార్యతో కలిసి ఆనందపురం పూల మార్కెట్‌కు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. శొంఠ్యాం సమీపానికి చేరుకున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఐచర్ వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో నూక రత్నం తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆనందపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సిహెచ్.వాసునాయుడు తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : జాతీయరహదారి పాత డెయిరీ ఫారం నుంచి ఎండాడ వైపు రహదారిలో విశాఖ వ్యాలీ జంక్షన్ దాటిన తర్వాత ఒక వ్యక్తి చెట్టుకొమ్మకు ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఆరిలోవ సిఐ కథనం ప్రరాకం... విజయనగరం జిల్లా, గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన కనకం దామోదరం (32) చోరీ కేసులో విశాఖ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉండేవాడు. రెండు రోజుల క్రితం కారాగారం నుంచి విడుదలయ్యాడు. మంగళవారం సాయంత్రం జాతీయ రహదారి జూ పార్క్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- కోటవురట్ల : ఆటో ఢీకొన్న ఘటనలో కోటవురట్ల గ్రామానికి చెందిన టిల్లాపుడి భాస్కరరావు (57) మృతి చెందాడు. వివరాలివి. గ్రామంలో స్వీట్ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న భాస్కరరావు ఎప్పటిలాగే సోమవారం రాత్రి 9 గంటలకు షాపు మూసి సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వెనక నుంచి ఆటో బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలైన భాస్కరరావును స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు

నదిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో పెనుగొల్లు ధర్మవరం బ్రిడ్జి పైనుంచి వరహానదిలోకి జారి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ విభూషణరావు తెలిపిన వివరాలివి. . మంగళవారం వమ్మవరం గ్రామానికి చెంది గోరపాటి ఏసు (41) సోమవారం వంతెన పైనుంచి వరహానదిలో పడిపోయాడు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోగా, మంగళవారం ఉదయం బ్రిడ్జి కింద నదిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టానికి నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

రైవాడ కాలువలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ జలాశయం ఎడమ ప్రధాన కాలువలో మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాలువలో పశువులు కడిగేందుకు వచ్చిన రైతులకు నీటిలో బోర్లా పడి ఉన్న సుమారు 50ఏళ్ల వయస్సున్న పురుషుని మృతదేహాన్ని గుర్తించారు.. విషయం తెలుసుకున్న దేవరాపల్లి పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


రోడ్డు విస్తరణకు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణకు పరిశీలన

ప్రజాశక్తి- గోపాలపట్నం : సింహాచలం రైల్వే స్టేషన్ రోడ్డు విస్తరణ కోసం జివిఎంసి, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి మంగళవారం స్థానిక ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే స్టేషన్ నుండి సదరం అప్పలనాయుడు మార్గం ద్వారా రోడ్డు విస్తరణ చేపట్టాలని, దీనిపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ రోడ్డు విస్తరణ జరిగితే గోపాలపట్నం రైల్వే స్టేషన్ వెళ్లే రహదారిలో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని చెప్పారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ శంకరరావు, కార్పొరేటర్లు దాడి వెంకటరమేష్, బొమ్మిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

31న రాజ్యాంగ పరిరక్షణ సదస్సు

ప్రజాశక్తి -గాజువాక : దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో 'రాజ్యాంగం -దళిత హక్కులు- బిజెపి విధానాలు' అంశంపై విశాఖలోని పబ్లిక్ లైబ్రరీలో ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు డిహెచ్‌పిఎస్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడాల రాంబాబు తెలిపారు. పెదగంట్యాడలోని పోతిన సన్యాసిరావు భవన్‌లో డిహెచ్‌పిఎస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ సదస్సు పేరుతో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ, దేశంలో భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్ర జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో బిజెపికి పూర్తి మెజారిటీ వచ్చి ఉంటే ఇప్పటికే అది జరిగి ఉండేదన్నారు. లౌకికవాదం, ప్రజాస్వామ్యం లాంటి పదాలను తొలగించాలని బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారాన్ని ఉధృతం చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పెదపూడి దుర్గారావు, సహాయ కార్యదర్శులు జి.ఆనంద్, కె.వనజాక్షి, సభ్యులు పి.కృష్ణ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న బాణాల శ్రీనివాసరావు

అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి-సీతమ్మధార : పార్కు అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, తగిన జాగ్రత్తలు పాటించాలని జివిఎంసి 44వ వార్డు వైసిపి కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. అక్కయ్యపాలెం హైవే గ్రీన్ బెల్ట్‌లో పార్కు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్కులో పిల్లలకు, వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు పాటించి పనులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం డిఇ భరణి, ఎఇ రవణమ్మ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వాంబే కాలనీలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను జిల్లా క్షయ, లెప్రసీ అధికారి డాక్టర్ రమేష్ మంగళవారం సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. ల్యాబ్ టెస్టులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభ ఐడి, టిబి ఎంబివి స్క్రీనింగ్, గర్భిణుల ప్రసవాలు తదితర వివరాలను వైద్యాధికారి ప్రశాంతిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి పరమేశ్వరరావు, టిబి ల్యాబ్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, వాంబే కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మోహన్‌కృష్ణ, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఆసుపత్రిలో పలు సూచనలిస్తున్న డాక్టర్ రమేష్

రోడ్డు విస్తరణ కాలనీల్లో సిపిఎం పర్యటన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి అచ్చునాయుడు లోవలో నిర్మించిన టిడ్కో ఇళ్ల సముదాయానికి వార్డులోని గుడివాడ అప్పన్న కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీల మీదుగా రహదారి విస్తరణకు ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రజలు ఆందోళన చెందడంతో ఆయా కాలనీల్లో సిపిఎం నాయకులు మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల నుంచి సమాచారం సేకరించారు. ప్రస్తుత రోడ్డును 30, 40 అడుగులకు విస్తరించేలా అధికారులు కొలతలు వేశారని, విస్తరణ వల్ల 90 ఇళ్లు పూర్తిగా, పాక్షికంగానూ తొలగించాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఇళ్లను అప్పులు చేసి కట్టుకున్నామని, ఇళ్లపై రుణాలు తీసుకుని పిల్లల వివాహాలు చేశామని తెలిపారు. అచ్చునాయుడు లోవ టిడ్కో ఇళ్ల నిర్మాణం సమయంలో వేరే మార్గం గుండా మెటీరియల్ తీసుకెళ్లారని, ఇప్పుడు అదే మార్గాన్ని రహదారిగా ఉపయోగించకుండా తమ ఇళ్లను తొలగించేలా నిర్ణయం చేయడంపై ఆవేదన వ్యక్తంచేశారు. తమ ఇళ్లను తొలగిస్తే చావు తప్ప వేరే గత్యంతరం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఉద్దేశించి సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాటాడుతూ, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను కలిసి ఇళ్ల తొలగించకుండా ప్రత్యామ్నాయ మార్గం అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. ప్రజల అభిప్రాయం తర్వాతే నిర్ణయం తీసుకోవాలని, అంత వరకు ఇళ్ల తొలగింపులకు పాల్పడొద్దని తెలియజేస్తామని పేర్కొన్నారు. ప్రజలంతా ఐక్యంగా నిలబడి తొలగించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, సభ్యులు ఆర్.లక్ష్మణమూర్తి, ఎల్.కృష్ణ, కార్యకర్తలు ఆర్.కర్రయ్య మద్దు గణేష్, ఎ.మహేంద్ర, బి.జగ్గునాయుడు, అర్జునరావు, ఎన్.గణేష్, పి.సురేష్, పి.లెనిన్, బి.ప్రసాద్, సింహాద్రి అప్పడు తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న జగ్గునాయుడు తదితరులు

బాలసరస్వతీదేవికి నివాళి

ప్రజాశక్తి-సీతమ్మధార : తొలి తెలుగు టాకీ సినిమా నేపథ్య గాయని రావు బాలసరస్వతీదేవికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖ పౌరగ్రంథాలయంలో మంగళవారం ఘన నివాళులర్పించారు. ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి తొలుత ఆమె చిత్ర పటానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, డాక్టర్ సూర్యరావు, సొసైటీ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం నరవ ప్రకాశరావు డాక్టర్ డి.సూర్యారావు మాట్లాడుతూ, బాల సరస్వతి 1930 నుండి 1960వ సంవత్సరం వరకు తెలుగు సినిమా రంగానికి పాటలు పాడి సంగీత ప్రియుల మన్ననలు పొందారని తెలిపారు. అనంతరం ఆమెపై రూపొందిన డాక్యుమెంటరీ, ఇంటర్వ్యూ చిత్రాలను ప్రదర్శించారు. ఈ సమావేశంలో బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబూరావురెడ్డి, డాక్టర్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో వార్డు : బొండా

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నానని కార్పొరేటర్ బొండా జగన్నాథం అన్నారు. వార్డు పరిధి వడ్లపూడి శ్రీగణేష్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వ్యాయామం పరికరాలు, పిల్లల ఆటల పరికరాలు, ఐమాక్స్ లైట్స్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్‌రాజు, పావాడ రమణమూర్తి, సూరిశెట్టి పెంటారావు, బొట్టా ప్రకాష్, ఆనంద్‌కుమార్, కడుపుట్ల శ్రీను, సుందర్ సునీల్, తాతారావు, వెంకటరావు, వెంకటేశ్వరరావు, సతీష్ కుమార్, శివయ్య, ఆచారి, సంధ్య, పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 52వ వార్డు పరిధి పాస్‌పోర్టు ఆఫీస్ గ్రీన్ బెల్ట్‌లో జరుగుతున్న హార్టీకల్చర్ సుందరీకరణ పనులను మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో వేస్తున్న గ్రీన్ గ్రాస్ పర్యవేక్షించారు. ఉడా లే అవుట్ వనిత వాకింగ్ ట్రాక్, హెల్తీ వాకర్స్ గ్రీన్ బెల్ట్ పార్కులలో అదనపు మౌలిక సదుపాయాలు, తాగునీరు, మరుగుదొడ్డి తదితరాలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వార్డు సోడదాసి సుధాకర్, ఈశ్వరరావు, తథాగత గౌతమబుద్ధ ధ్యాన వనం సభ్యులు, వైసిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, స్వింగ్ మిషన్ ఆపరేటర్ (టైలరింగ్) కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. 18 నుండి 35 ఏళ్ల ఉన్న ఆశక్తి గల మహిళల దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ ఎస్.అన్నపూర్ణను సంప్రదించాలని సూచించారు.

తూర్పు కాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా మహంతి

ప్రజాశక్తి-మధురవాడ : తూర్పు కాపు మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా విశాఖకు చెందిన ప్రముఖ సామాజిక సేవకురాలు డాక్టర్ ఉషా మహంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తూర్పు కాపు మహిళల విద్య, సాధికారత, ఉపాధి అవకాశాలు, సామాజిక ప్రగతికి కృషిచేస్తానని చెప్పారు. ఈ బాధ్యత అప్పగించిన జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం కెజిబివిలో సేవలందించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన ప్రధానోపాధ్యాయులు సత్య లావణ్య, ఇంగ్లీష్ టీచర్ బి.స్వాతికి ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్, ఓఎస్‌జి. ఫౌండేషన్ ప్రతినిధి శివ దళాయి, వృక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాకర సురేష్, వైకుంఠం, మారుపిళ్ల సాయిగ్నేశ్వర్, పోతిన సాయికుమార్, ఎస్ఎంసి. చైర్మన్, ఎల్‌వి.పాలెం సర్పంచ్ లొడగల రమణ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకితభావాన్ని కొనియాడారు.

ఘనంగా అమృతరావు జయంతి

ప్రజాశక్తి- ఉక్కునగరం: విశాఖ ఉక్కు కర్మాగారం కోసం 21రోజుల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేసి ప్రాణాలకు సైతం లెక్కచేయలేని ఉక్కు సాధకులు, సుభాష్ చంద్రబోస్‌తో పాటుగా సైన్యంలో పనిచేసిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, గుంటూరు మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు తమనంపల్లి అమృతరావు 105వ జయంతిని స్టీల్‌ప్లాంట్‌లోని అమృతరావు పార్కులో ఘనంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ చైర్మన్ ఎవి రమణారావు, వైస్ చైర్మన్ జెర్రిపోతుల మోహన్‌కుమార్ నిర్వహణలో జరిగిన ఈ జయంతి వేడుకలకు గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైఎంసిపి చైర్మన్ వై.వరలక్ష్మి, పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని అమృతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉక్కు పోరాటంలో చనిపోయిన 32మంది అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్ కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమృతరావు స్ఫూర్తితో ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఉండేందుకు పోరాడుదామన్నారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.9 లక్షల కోట్ల రుణాలను ప్రయివేటు, కార్పొరేట్ వ్యాపారులకు రద్దుచేశారని తెలిపారు. ప్రభుత్వం రంగంలో ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కున్న రూ.20 వేల కోట్ల అప్పును రద్దు చేయకుండా, గనులు కేటాయించకుండా ప్రైవేటీకరణ చేయడానికే మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. రూ.8 లక్షల కోట్లు విలువచేసే స్టీల్‌ప్లాంట్ భూములను ప్రైవేటీకరణ చేస్తున్నారా, లేక రూ.20వేల కోట్లు అప్పు ఉన్నాయని స్టీల్ ప్లాంట్‌ను అమ్మేస్తున్నారా అన్న విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్‌చేశారు. అమృతరావు స్ఫూర్తితో కర్మాగారాన్ని కాపాడుకోవాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని లేదా సొంత గనులు కేటాయించాలని కోరారు. గాంధీ మిషన్ కన్వీనర్ రమణరావు మాట్లాడుతూ ఆంధ్రులకోసం అమృతరావు ప్రాణాన్నే పణంగా పెట్టి విశాఖ ఉక్కును సాధించారని తెలిపారు. ఈ కర్మాగారానికి కూటమి ప్రభుత్వం చేదోడు అందించి కాపాడుకునే ప్రయత్నాలను చిత్త శుద్ధితో చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరాం, పి.వి.రమణమూర్తి, జెర్రిపోతుల మోహన్‌కుమార్, శకునాల చంద్రశేఖర్, యు.రామస్వామి, విళ్లా రామ్మోహన్‌కుమార్, దేవులపల్లి సంపూర్ణం, కె.పరంధామయ్య, డివి.రమణయ్య, పోలీస్ నాయుడు, అట్టా అప్పారావు, బూసి వెంకట్రావు, డివి.రమణా రెడ్డి, దేవిడ్ రాజు, బొండా ఎల్లాజి, దాసరి సురేష్ బాబు, పులి రమణారెడ్డి, పితాని భాస్కర్, వై.కోటి, వంశీ, రవికుమార్, సూరిబాబు, రమణ పాల్గొన్నారు.



అమృతరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

యూరియా కొరతతో రైతన్నల అగచాట్లు

- ఒక్క బస్తా కోసం గంటల తరబడి పడిగాపులు
- ఒట్టి చేతులతోనే నిరాశగా వెనుదిరుగుతున్న అన్నదాతలు



సబ్బవరంలో ఎరువుల కోసం పడిగాపులు పడుతున్న రైతన్నలు

ప్రజాశక్తి -సబ్బవరం : యూరియా కోసం మండలంలోని రైతన్నలు పడిగాపులు పడినా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపడా యూరియా లేకపోవడంతో అనేకమందికి ఒట్టి చేతులతో వెనుదిరగాల్సి వస్తోందని వాపోతున్నారు. మండలంలోని ఇరువాడ, అసకపల్లి, గొల్లల పాలెం, పైడివాడ అగ్రహారం నాలుగు పంచాయతీ రైతులకు మంగళవారం పైడివాడ పైడివాడ రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేసారు. 12 టన్నులు బరువైన 240 బస్తాల యూరియాను అందుబాటులో ఉంచగా, దాదాపు 450 మంది రైతులు రావడంతో కొందరికి మాత్రమే యూరియా అందేపరిస్థితి ఉంది మిగలిన వారంతా నిరాశగా వెనుదిరిగారు.

వరి పైర్లు చిరు పొట్ట దశలో ఉండడంతో యూరియా వేయాల్సిన అవసరం ఉందని, అయితే రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో లేకపోవడంతో పంట దిగుబడులపై ప్రభావం చూపే ప్రభావం ఉందని రైతులు వాపోతున్నారు. దీనిపై పైడివాడ అగ్రహారం సర్పంచ్ వడ్డాది అప్పలరాజు మాట్లాడుతూ రైతుల యూరియా అవసరాలపై ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించాలన్నారు. అలాగే పైడివాడ అగ్రహారం ఎంపిటిసి సీరం అప్పలరాజు మాట్లాడుతూ వరిపంట పొట్ట దశలో యూరియా వేయాల్సిన అవసరం ఉందని అధికారులకు తెలిసినా, ప్రభుత్వపరంగా సమకూర్చ లేకపోవడం సరికాదన్నారు. స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణకు వివరణ కోరగా రైతులకు కావాల్సిన యూరియాను దఫాలుగా అందజేస్తున్నా మన్నారు. యూరియా అవసరంపై ఇండెంట్ పెట్టామన్నారు.

రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా ?

అనకాపల్లి : యూరియా అందక రైతులు గగ్గోలు పెడుతుంటే కూటమి ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయమని రాష్ట్ర గవర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, వైసిపి 80వ వార్డు ఇన్చార్జి కెఎం నాయుడు ప్రశ్నించారు. మంగళవారం స్థానిక వివి రమణ సహకార భవన్‌లో యూరియా కోసం పడుతున్న ఇబ్బందులపై రైతుల నుంచి ఫోను సమాచారంతో అక్కడకు చేరుకుని సిబ్బంది, అధికారులను అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని మండిపడ్డారు.

రైతుల అవసరాలకు సరిపడా యూరియాను సమకూర్చడంతో ప్రభుత్వ వైఫల్యం వల్ల ఒక్క బస్తా కోసం ఉదయం నుండి పడిగాపులు పడినా ఫలితం లేకపోతోందని ఆరోపించారు.. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కార్యదర్శి వాసుపల్లి తాతయ్యలు, కాంగ్రేగుల వెంకటసాంబ, కాంగ్రేగుల దేవ, ఇతర నేతలు, రైతులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న యూనియన్ జిల్లా కార్యదర్శి రాము

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సిఐటియు 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఈ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్ రాము పిలుపునిచ్చారు. మంగళవారం అచ్యుతాపురంలో ఆటో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ మహాసభలలో కార్మికులు, కర్షకులు ఉద్యోగులు కూలీలు మత్స్యకారులు అన్ని వర్గాల వారు హాజరై ఆయా రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, పోరాట కార్యాచరణ రూపొందిస్తారన్నారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు యువశక్తి ఆటో యూనియన్ అధ్యక్షులు డి చంటి ఉపాధ్యక్షులు టి రాజు, కార్యదర్శి ఏ అప్పారావు, కోశాధికారి డి డి సన్నిబాబు,దుర్గా, మురళి, కుమార్,శ్రీను పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన దొరైస్వామి


చంద్రబాబుకు మొక్క బహూకరిస్తున్న దొరైస్వామి

ప్రజాశక్తి అచ్యుతాపురం : దీపావళి పండగ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరైస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి మొక్కను బహూకరించి, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దొరైస్వామి మాట్లాడుతూ, దీపావళి రోజున చంద్రబాబును కలవడం మరిచిపోలేని అనుభూతి అని, ఇది మరపురాని జ్ఞాపకంగా నిలిచిపోతుందన్నారు..

ట్రంప్ దిష్టిబొమ్మ దగ్ధం


ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఏపి రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి- కె కోటపాడు: వ్యవసాయం, అనుబంధ రంగాల ఉత్పత్తులపై భారగా సుంకాల పెంపును నిరసిస్తూ మంగళవారం ఎ.కోడూరు మెయిన్‌రోడ్డుపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ అమెరికా విధించిన సుంకాల ప్రభావంతో రైతులు, కార్మికులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. రాష్ట్రంలో చిన్నపరిశ్రమలు మూతబడి నిరుద్యోగ సమస్య ప్రబలే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, ఆయారంగాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో వనుము సూర్యనారాయణ, ఈర్లె నాయుడుబాబు, కొడకల చిన్నబాబు, రొంగలి గోపి, సూరెడ్డి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత వై కింగ్ టీం

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల క్రీడామైదానంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. మండలంలోని నాలుగు టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా, 'వై కింగ్' టీం విజేతగా నిలిచింది. అమిగోస్ టీం రన్నర్లుగా నిలిచారు విజేతలకు ఆర్‌ఎఫ్‌సి క్లబ్ తరపున షీల్డ్, నగదు బహుమతులను అందజేశారు.

డిఎ ఉత్తర్వులను సవరించాలి



మాట్లాడుతున్న చిన్నబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రకటించిన ఒక విడత డిఎ మంజూరు ఉత్తర్వులను సవరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం 3.6 శాతం డిఎను మంజూరు చేస్తూ జిఒ 60, 61 విడుదల చేసిందన్నారు. అయితే ఈ జిఒలో డిఎ బకాయిలను ఉద్యోగ విరమణ పొందిన తర్వాత ఇస్తామని పేర్కొనడం దారుణమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని ఇటువంటి ఉత్తర్వులపై ఉద్యోగ, ఉపాధ్యాయులంతా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వెంటనే సవరించాలని కోరారు. 12వ పిఆర్ కమిషన్‌ను నియమించి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులు పి వెంకటరావు పాల్గొన్నారు.

రాయవరం : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒక కరువు భత్యం మంజూరు చేస్తూ జారీ చేసిన జిఒలు 60- 61 లను తక్షణం సవరించాలని ఎపిటిఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కెఎల్ఎన్ ధర్మారావు, దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు నాలుగు డిఎలు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఒక్క డిఎను మాత్రమే సిఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. ఇదే సందర్భంలో డిఎ ఎరియర్స్‌ను ఉద్యోగ విరమణ అనంతరం ఇస్తామని ప్రకటించడం దారుణమన్నారు. ఆయా జిఒలను వెంటనే సవరించాలన్నారు. బకాయిలను సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు తక్షణమే నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలకు తెరలేపే అవసరం ఉందని హెచ్చరించారు.

ఉత్సాహంగా చెకుముకి సైన్స్ సంబరాలు


మండలస్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు అచ్యుతాపురం మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలో ప్రారంభమయ్యాయి. చెకుముకి పరీక్ష పేపరును హరిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీపాద రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు మారిశెట్టి వెంకట అప్పారావు, ఉప్పాడ రాము మాట్లాడుతూ పోటీల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 1000 మంది పైగా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం వి గాంధీ, అవతల అప్పయ్య లింగం పాల్గొన్నారు లిమండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు వచ్చేనెల ఒకటిన నిర్వహించనున్నట్లు జెవివి నేతలు వెల్లడించారు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంఎఎల్ కాలేజీ విద్యార్థులు


డివిజన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఏలూరులో రాష్ట్రస్థాయి అండర్-19 అథ్లెటిక్స్ పోటీలకు ఎఎంఎఎల్ కళాశాల విద్యార్థులు ఎస్. తేజ, ఎల్.రమణమూర్తి, జి.నరేష్, ఎం.సిద్ధు, బి. హర్షిణి అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల యాజమాన్య అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు (శ్రీను), వైస్ ప్రిన్సిపాల్ టి. నిరంజన్‌కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యులు వి.బాలకృష్ణ, కే.రవీంద్ర, యు.కృష్ణ కిషోర్, సూపరింటెండెంట్ పి. అనురాధ, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కెవిఎస్.నాయుడు అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ కె.శత్రుఘ్న, సిబ్బంది అభినందించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి -కశింకోట : గ్రామంలో పారిశుధ్యం పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ చంద్రశేఖరరావు సూచించారు. మంగళవారం బయ్యవరం గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇంటింటా తడిపొడి చెత్త సేకరణ, వాటిని సంపద కేంద్రానికి తరలింపు, అక్కడ సేంద్రీయ ఎరువుగా తయారీ, దాన్ని విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవడంపైసూచనలు చేశారు.

యస్ రాయవరం : మండలంలో పలు గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎంపిడిఒ మీనా కుమారి, డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ పరిశీలించారు. తిమ్మాపురం, ధర్మ వరం, పెద గుమ్ములూరు గ్రామ పంచాయతీలలో పర్యటించి తడి, పొడి చెత్తలను సేకరణపై ఆరా తీశారు దుకాణదారులు తప్పనిసరిగా డస్ట్ బిన్ ఏర్పాటు చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిలు ప్రసాద్, మూర్తి, సురేష్ కుమార్, నాగప్రభ, ప్రియాంక, నాగమణి, చిన్నారావు, శివాగణేష్ పాల్గొన్నారు.

30న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, తదితరులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష కరపత్రాలను మంగళవారం దిబ్బిడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి సత్యారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు శిష్ల తమ్మిరాజు మాట్లాడుతూ జిల్లాలో వీరవల్లి అగ్రహారం (వడ్డాది), మునగపాక, కశింకోట కేంద్రాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు కేంద్రాలలో 1500 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. వెంటనే ఫలితాలను ప్రకటించి, 110 పైబడి మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు డివిజె అప్పారావు, ఎవిఎస్ మూర్తి పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం ధ్వంసం

ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యాన నిరసన, పోలీసులకు ఫిర్యాదు



ఎస్‌ఐకి ఫిర్యాదుచేస్తున్న ఎంఆర్‌పిఎస్ నేతలు



ధ్వంసమైన జగ్గీవన్‌రాం విగ్రహం

ప్రజాశక్తి-కోటవురట్ల : మాకవరపాలెం మండలం తూటిపాల గ్రామంలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాన్నిసోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక ఎంఆర్‌పిఎస్ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని నిరసిస్తూ మంగళవారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతూ స్థానిక ఎస్ఐ దామోదరనాయుడుకు ఫిర్యాదు చేశారు

ఘనంగా చిట్టిబాబు పుట్టినరోజు వేడుక



చిట్టిబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

ప్రజాశక్తి- పాయకరావుపేట : టిడిపి పాయకరావుపేట మండల మాజీ అధ్యక్షులు, తుని నియోజకవర్గాల పరిశీలకులు పెదిరెడ్డి సత్యనారాయణ మూర్తి (చిట్టిబాబు) 52వ పుట్టినరోజు వేడుకలు పట్టణంలోని శ్రీలక్ష్మీ గ్రాండ్ కన్వెన్షన్ హాలులో ఘనంగా జరిగాయి. పాయకరావుపేట, తుని నియోజకవర్గాల టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది విచ్చేసి చిట్టిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గజమాలలు, శాలువాలతో సత్కరించారు. వేడుకల్లో తోట నగేష్, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, గింజాల లక్ష్మణ రావు, జానకి శ్రీను, చించలపు ప్రదీప్ (పద్దు), యాళ్ల వరహాలబాబు, చిక్కాల శ్రీనివాసరావు, దేవవరపు రాజుబాబు, దేవర సత్యనారాయణ, గూటూరు శ్రీనివాసరావు, చింతకాయల రాంబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి శ్రీను, గొర్రెల రాజుబాబు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియం కేరీ, మైలపల్లి అశోక చక్రవర్తి, ఏడిద సురేష్, కట్టా శ్రీను, బోడపాటి శ్రీను, గంపల చినరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్, కుందూరు కుమార్, గంపల రాంబాబు, శివలంక నాగమల్లి, చిరుకూరి పేర్రాజు, కుంచా ప్రసాద్, ఎమ్మిలి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్: రమా సమేత సత్యనారాయణ స్వామి,సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీకమాసోత్సవాల పోస్టర్లను రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ఆవిష్కరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆలయ బోర్డు ఛైర్మన్, ధర్మకర్తలు టిడిపి నేతలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ ఛైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : హరిపాలెం గ్రామ ఉత్సవ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన మారిశెట్టి ప్రసాద్‌ను మంగళవారం రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సత్కరించారు. టిడిపి మండల శాఖ అధ్యక్షులు పీలా తులసిరాము, కార్యదర్శి కే అప్పారావు, మాజీ సర్పంచ్ కాండ్రేగుల సూర్య నారాయణ, ఆవనీటి సంఘ ఛైర్మన్ కె జోగి నాయుడు, కాండ్రేగుల వెంకటరమణ, సహకార సంఘ డైరెక్టర్ కె రమణ పాల్గొన్నారు.

రహదారులు, వంతెనల నిర్మాణంలో నిర్లక్ష్యంపై

మెడకు ఉరితాళ్లతో వినూత్న నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు, వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి : బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యంతో అర్థాంతరంగా నిలిచిన రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి, రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతూ వాలాబు పంచాయతీ కోడాపల్లి, రామన్నపాలెం, బుచ్చంపాలెం, పూలగరువు గ్రామాల ఆదివాసీ గిరిజనులు వినూత్నరీతిలో నిరసన చేపట్టారు మంగళవారం వాలాబు పంచాయతీ రామన్నపాలెం గెడ్డ వద్ద అసంపూర్తిరోడ్డుకు అడ్డంగా ఉరికంభం ఏర్పాటుచేసి, మెడలకు ఉరితాళ్లను బిగించి ఆందోళన చేపట్టారు. ఆదివాసీ గిరిజనుల నిరసనకు వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధన కార్యదర్శి డి వెంకన్న మద్దతు ప్రకటించి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవతో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా వాలాబు పంచాయతీలోని గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పనకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టిన పనులకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే పనులన్నీ నిలిచిపోయి గిరిజనులకు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయని మండిపడ్డారు.,వీరభద్రిపేటకు రూ.84 లక్షలతో మంజూరైన బిటి రోడు మట్టిపనుల దశలోనే ఆగిపోయిందని, నేరెళ్ళపూడి, బోడిగరువు, మదన గరువు గ్రామాలకు రూ.1.90 కోట్లుతో చేపట్టిన రోడ్లు కూడా సగంలోనే నిలిచిపోయాయన్నారు. పల్లెపండుగలో రోడ్ల మంజూరులో నున్న చొరవ, బిల్లుల చెల్లింపుల్లో లేకపోవడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లతోపాటు ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వాలాబు, చింతలపూడి పంచాయతీల్లో అసంపూర్తి రోడ్లతోకొత్త కష్టాలపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు దృష్టి సారించాలని, చేపట్టిన పనుల ప్రాప్తికి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుతోపాటు మిగతా నిధులనూ కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజనుల రహదారి కష్టాలపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపడ్డారు. కార్యక్రమంలో డి శంకరరావు, ఎరకయ్య, కె ఈశ్వరరావు, కె పైడితల్లి, సిహెచ్ లక్ష్మణ, డి.నూకాలు, సిహెచ్ చినదేముడు, మామిడి దేముడు, ఇ గోపాలుడు, బి.నాగేశ్వరరావు, కె, రాముడు, కె, దేముడు సిహెచ్ రాంబాబు, గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్‌లో సమస్యలను పరిష్కరించుకుందాం



మాట్లాడుతున్న టిడిపి నేత బాబ్జి

ప్రజాశక్తి -సబ్బవరం: మండల కార్యాలయాలు, గ్రామసచివాలయాల్లో టిడిపి నేతలు, కార్యకర్తల సమస్యలపై అధికారులు, ఉద్యోగులు సరిగా స్పందించడం లేదని, పిజిఆర్ఎస్‌లో అర్జీలు సమర్పించి, అక్కడే కూర్చొని, సమస్యలను పరిష్కరించుకుందామని పెందుర్తి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గండి బాబ్జి అన్నారు. మంగళవారం మండలంలోని అమృతపురం గ్రామంలో మండల టిడిపి అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు అధ్యక్షతన సమావేశంలో మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త మధ్య విబేధాలు ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు. ఎమ్మెల్యేగా కూటమిలోని పార్టీలకు సమప్రాధాన్యత ఇవ్వకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమౌతున్నాయని, దీని వల్ల టిడిపి శ్రేణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

టిడిపి మండల అధ్యక్షులు గండి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సమస్యలపై సరైన స్పందన లేకుంటే అవసరమైతే ఆయా కార్యాలయాలకు తాళాలు వేద్దామన్నారు. గ్రామాల్లో కూటమి పార్టీలతో గొడవలకు పాల్పడకుండా సంయమనంతో పని చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు గండి వంశీ దీప్, పి ఎ సి ఎస్ ఛైర్మన్ గండి దేముడు, బర్నికాన సాయి నాధరావు, కోటాన అప్పారావు,మిడతాడ మహాలక్ష్మి నాయుడు, డాడీ లావణ్య కన్నం నాయుడు, ఆకుల గణేష్,గొర్లి చైతన్య,రేసుపూడి రమణ, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, పడాల వెంకటరమణ,కోరాడ శ్రీను, పెద్దాడ రమణమ్మ, పాల్గొన్నారు.

వైద్య సేవలపై ఆరా

ప్రజాశక్తి -యస్ రాయవరం : మండలంలోని పెనుగొల్లు పిహెచ్‌సిని డిఎంహెచ్ఒ డాక్టర్ హైమావతి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ల్యాబ్ టెస్టుల, మందులు నిల్వలు తనిఖీ చేశారు. ప్రసూతి గదిని పరిశీలించి, ప్రసవ వివరాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు.వ్యాధులు రాకుండా సిబ్బందికి ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యాధికారి డాక్టర్ రవిని ఆదేశించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ రమణారావు, లక్ష్మీనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్ రమణమ్మ, శ్రీనివాస్ హెల్త్ సూపర్వైజర్ ఆదినారాయణ మూర్తి, ఫార్మసిస్ట్ సుబ్బారావు, స్టాఫ్ నర్స్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటీకరణకు నిరసనగా వైసిఇప ఆధ్వర్యంలో మంగళవారం భోగాపురం, జంగులూరు గ్రామాలలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ పర్యటించి పరిశీలించారు. కూటమిపాలనలో ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు దేశం శెట్టి శంకర్రావు, జెడ్‌పిటిసి లాలం రాంబాబు, జిల్లా పరిషత్ కో ఆప్షన్స్ సభ్యులు నర్మల కుమార్, కోన లచ్చన్నాయుడు పాల్గొన్నారు.

ఇద్దరు మరణంతో విషాద ఛాయలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సోమ, మంగళవారాల్లో ఇద్దరు అకాలమరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దీపావళి రోజున కోరుబిల్లి గోవింద్ అనే ఉద్యోగి చనిపోగా, సోమవారం రాత్రి గ్రామంలో దీపావళి వేడుక, దివ్వలు కొట్టే కార్యక్రమాన్ని విరమించుకున్నారు. మంగళవారం ఉదయం అనసూరీ సాయి అనే యువకుడు అకస్మాత్తుగా చనిపోయాడు. వీరిద్దరికీ మంగళవారం ఒకే రోజున దహన సంస్కారాలు నిర్వహించారు.

నేడు ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- ఎస్ రాయవరం : మండలంలో వ్యాపార కేంద్రం అడ్డరోడ్డు ఫ్లైఓవర్ కింద ఏర్పాటుచేసిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు విగ్రహాన్ని ఈనెల 22న ఆవిష్కరించనున్నట్లు బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. వడ్డాదిలో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును మర్యాదపూర్వకంగా కలిసి, విగ్రహావిష్కరణకు రావాలని ఆహ్వానించినట్టు తెలిపారు.కార్యక్రమంలో బత్తుల వాసు, సోమిరెడ్డి రాజు, బత్తుల సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా పంచరాత్రుల ఉత్సవాలు

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలిలో ఏటా జరిగే పంచదాత్రుల ఉత్సవాలు తులసీనగర్ భూలోకమాంబ, పాతవీధి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమాలకు ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎంపి పప్పల చలపతిరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అనువంశిక ధర్మకర్త ఆడారి శ్రీధర్ దంపతులు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండవ రోజైన మంగళవారం అమ్మవారిని లలితాదేవి ఒడిలో బాలత్రిపురసుందరి అలంకరణతో తీర్చిదిద్దారు. కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షులు పరమేశ్వరరావు, కూటమి నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, మళ్ల కొండబాబు, జానకిరామ్, ఊటికోట రమేశ్‌బాబు, కొఠారు శ్రీను మాస్టారు, గుర్రాల శేఖర్, పప్పు ఈశ్వరరావు, నక్కా శివశంకర్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు బహుమతులు



బహుమతులిస్తున్న ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : బాలికలు అన్ని రంగాలలో ముందుండాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మండలంలోని పాఠశాలల బాలికలకు నిర్వహించిన ఆటలు, వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మంగళవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ బాలికలు విద్యతోపాటు ఆరోగ్యంపై తగుశ్రద్ధ కనబర్చాలని చెప్పారు. ఎంఇఒ-1 కూనిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో 'ఫిర్యాదుల పెట్టె" ఏర్పాటు చేశామని, విద్యార్థులు తమ సమస్యలను కాగితంపై రాసి అందులో వేయాలని సూచించారు. సర్పంచి యర్రంశెట్టి భవాని మాట్లాడుతూ ఆడపిల్లలు బాగా చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు, లింగవివక్ష, టోల్ ఫ్రీ నెంబర్లపై విద్యార్థినులు మాట్లాడారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు సుశీల, అనిత, ఆదిలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ

దేవరాపల్లి : మండలంలోని ములకలపల్లి, వాకపల్లి అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తులను స్వయంగా క్రాస్ చెక్ చేసి, డేటాలో ఉన్న తేడాలను వెంటనే సరిదిద్దాలని కార్యకర్తలకు ఆదేశించారు. కేంద్రాల్లో లభించే ఆహారపదార్థాల నాణ్యత, లబ్ధిదారులకు వాటి సరఫరా విధానం, పరిశుభ్రత వంటి అంశాలను సమీక్షించి తగిన సూచనలు ఇచ్చారు. సిడిపిఒ పి. లలిత కుమారి, సూపర్వైజర్ ఎన్.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

24న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం సాగర్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ నెల 24న మండలంలో గతేడాది టెన్త్‌లో ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేయనున్నట్లు ఫ్యాక్టరీ హెచ్ఆర్ పాండురంగారావు తెలిపారు. ఏటా ఆనవాయితీగా సాగర్ సిమెంట్స్ తరపున చదువులో మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని, తద్వారా చదువుపై విద్యార్థులకు ఆసక్తి, పోటీతత్వం పెంచే చర్యలు చేపడుతున్నామన్నారు.

డివిజన్ స్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా



బుచ్చయ్యపేటలో సత్తా చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల క్రీడాకారుల ఎంపిక పోటీలు నర్సీపట్నంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నర్సీపట్నం ఏపీఆర్ఈఐఎస్ గ్రౌండ్స్‌లో ఈ డివిజనల్ స్థాయి పోటీలను టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ప్రారంభించారు. ఆయన బాలికల కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో పోటీలను తిలకించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అత్యంత ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి, ఐక్యా పెరగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. తాను ఇటీవల గొలుగొండ మండలం గుండుపాల స్కూల్‌ను సందర్శించినప్పుడు, ఒక రెజ్లర్ బాలిక తన ప్రతిభను చూపిందని, ఆ అమ్మాయికి అవసరమైన క్రీడా పరికరాలను అందించి ప్రోత్సహిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని పట్టుదలతో ముందుకు సాగితే దేశానికి గర్వకారణంగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎంపికలకు 12 మండలాల నుండి 160 మందికి పైగా బాలికలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, ధనిమి రెడ్డి మధు, రాజుల నాయుడు, కోఆర్డినేటర్ రుతల శ్రీనివాస్ నాయుడు, అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ అచ్చియమ్మ, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు ఏ. బుల్లబ్బాయి పాల్గొన్నారు.

కొత్తకోట:డివిజన్ స్థాయి క్రీడా పోటీలలో కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభకనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17,18న మండల స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన 20 మంది బాలికలు వివిధ క్రీడా పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో డివిజన్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. వీరు మంగళవారం నర్సీపట్నం గురుకుల పాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. దీనిలో అండర్ -14 వాలీ బాల్ జిల్లా స్థాయి పోటీలకు పి. హేమశ్రీ, రమ్యశ్రీ లు ఎంపికయ్యారు. అండర్- 17 విభాగంలో జె కె ఎస్ ఎల్ దేవి, అనురాధలు ఎంపిక కాగా కబడ్డి పోటీలకు అండర్ -14 విభాగంలో పడాల హిమశ్రీ, అండర్- 17 విభాగంలో జే కే ఎస్ ఎల్ దేవి లు ఎంపికైనట్టు క్రీడల కోఆర్డినేటర్ వెంకట రమణ ప్రకటించారు. విద్యార్థినిలను పాఠశాల హెచ్‌ఎం రాజకుమార్ వ్యాయామ ఉపాధ్యాయులు వి. ఆనంద్ తదితరులు అభినందించారు.

అనకాపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయిని డిఇఒ గిడ్డి అప్పారావు నాయుడు అన్నారు. మంగళవారం జివిఎంసి ప్రధాన పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలను పారంభించారు. త పాఠశాల పిఇటి ఎస్‌వి.నరసింహం డివిజనల్ కోఆర్డినేటర్‌గా ఈనెల 23 వరకు వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ, యోగా, చెస్, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ కోటేశ్వరరావు, హెచ్‌ఎంబ్రహ్మాజీ, పిఇటిలు వెంకటరావు, కెఎం నాయుడు, పి కమల పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సీతయ్య పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఆటల పోటీలలో తురకలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి డివిజన్‌స్థాయికి అర్హత సాధించారు. ఖోఖో అండర్ 14 విభాగంలో కురం దాసు అనూష, నమ్మి చాందిని, అండర్- 17 లో చిన్నిదేవి, గొర్లిదేవి, చెల్లుబోయిన అశ్వని సత్తాచాటి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. 100 మీటర్ల పరుగు పోటీలో నమ్మి చాందిని డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, పిఇటి నాగమణిలను హెచ్‌ఎం చంద్రకళరాజు, ఎస్‌టిఎ జిల్లా అధ్యక్షుడు టివి.రమణ అభినందించారు.



కొత్తకోటలో...



నర్సీపట్నంలో....

ఆనందపురం : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆర్‌జెడి కె.విజయ్ భాస్కర్, ఎపిసి జె.చంద్రశేఖర్, సిఐ సిహెచ్.వాసు నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మంగళవారం జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో కబడ్డీ, చెస్, యోగా, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, షటిల్ తదితర క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కామేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహమూర్తి, ప్రసాద్, బుజ్జి తదితరులు పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఎంఇఒ గంగరాజు, పిడి అసోసియేషన్ ప్రతినిధులు లలిత్ కుమార్, రవి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, ఎస్‌ఎంసి చైర్మన్ బంటుబిల్లి లక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కొట్యాడ రమాదేవి, రెడ్డి బాబు, కొట్యాడ సత్యమూర్తి, చందక సూరిబాబు, భాస్కరరావు, ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆనందపురంలో...



మాట్లాడుతున్న వెంకటేష్

నేడు ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గం ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు జంక్షన్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ ను జయప్రదం చేయాలని నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. నక్కపల్లిలో హెూం మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొల్లి రవీంద్ర, హెూం మంత్రి వంగపూడి అనిత, జిల్లా అధ్యక్షులు తాతయ్య బాబు, శాసనసభ్యులు హాజరుకానున్నాని, పార్టీ శ్రేణులంతా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



ముస్తాబైన శివాలయం

శివాలయం ముస్తాబు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాక శివాలయంలో కార్తీక మాసం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అర్చకులు మహేష్, నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. బుధవారం నుండి నెల రోజుల పాటు కార్తీక మాసం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్నారని ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు. కార్తీక మాసం సందర్భంగా నాలుగు సోమవారాలు ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయానికి రంగులు వేసి, విద్యుద్దీకరణ చేపట్టారు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం నెలరోజుల పాటు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 22న బుధవారం విద్యుత్ సరఫరా పాక్షికంగా నిలిపి వేస్తున్నామని నర్సీపట్నం ఎంపీడీసీఎల్ ఆపరేషన్ ఇఇ అప్పారావు, మండల అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు లు తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ, కొత్తకోట సబ్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలకు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన బ్రేకర్స్ సబ్ స్టేషన్‌లో అమర్చుతున్నందున ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాల లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వారు తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘాట్ రోడ్డులో విరిగి పడిన కొండ చరియలు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడుతున్నాయి. మండలంలోని గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురుస్తుంది. ఘాట్ రోడ్డు శివలింగపురం ఒకటో నెంబర్ కు సమీపము బొర్రా జంక్షన్ ఆరో నెంబర్, బొర్రా గుహలకు వెళ్ల రైల్వే గేటు సమీపము మలుపు వద్ద సోమ, మంగళవారం కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో స్థానికులతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు వచ్చే విదేశీ ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఇబ్బంది పడ్డారు.

జెడ్‌పిటిసి హత్య కారకులను శిక్షించాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, కుటుంబీకులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: రోలుగుంట మండలం ఎంకే.పట్నం శివారు పెదపేట ఆవరణలో కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజును హత్య చేయడంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకు రావడంతో మండల ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు.పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, మాజీ శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి, ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. కోయ్యూరు మండలం నుంచి, అల్లూరి సీతా రామరాజు జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ధర్నాలో పాల్గొన్నారు. హత్యకు కారకులైన వారిని, హత్యను ప్రేరేపించారని అనుమానం ఉన్న వారిని తక్షణం అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం భూ వివాదానికి సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

ఏరియా ఆసుపత్రి వద్ద మంగళవారం ఈ సంఘటన గురించి రోలుగుంట సిఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం హత్య కేసు పై విచారణ జరుపుతున్నామని దాడి చేసిన కుటుంబాలపై కేసు నమోదు చేశామని త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు. అజయ్ కుమార్ పాత్ర పై విచారణ చేస్తున్నామని అన్నారు.

వ్యవస్థల వైఫల్యం:
మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్థానిక ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కూటమి పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు గురైన కొయ్యూరు జడ్పిటిసి వారా నూకరాజు మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, వార నూకరాజు మరణాన్ని తాను రాజకీయం చేయదలుచుకోలేదని అన్నారు. గతంలో ఇదే భూవివాదానికి సంబంధించి తమ పార్టీ నాయకుడైన జడ్పీటీసీ నూకరాజుపై దాడి చేసి కొట్టి గాయ పరిచారని చెప్పారు. ఇదే మొదటి సంఘటన కాదని అన్నారు. బైండోవర్ కూడా చేశారని పోలీసులు చెబుతున్నారని అయినా హత్యకు తెగబడ్డారంటే ఇందులో వ్యవస్థల వైఫల్యం పూర్తిగా కనిపిస్తున్న దని ఆరోపించారు.శాంతి భద్రతల విషయంలో భయం అనేది ఉండేలా పనిచేయాలని తాము కోరుతున్నామని అన్నారు. వారా నూకరాజు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అనకాపల్లి పార్లమెంట్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత బొడ్డేడ ప్రసాద్, బుచియ్య పేట జడ్పిటిసి దొండ రాంబాబు, గొలుగొండ జడ్పిటిసి గిరిబాబు, అల్లూరి సీతారామరాజు జిల్లా కు చెందిన వైఎస్సార్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయినికి పురస్కారం

ప్రజాశక్తి- నక్కపల్లి:వ్యాయామ ఉపాధ్యాయురాలు డాక్టర్ షహనాజ్‌కు జాతీయ స్థాయిలో సిసిసి పురస్కారం అందుకున్నారు. ఇటీవల డి.ఎస్.సిలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా ఎంపికై మండలంలో చినదొడ్డుగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలుగా ఈనెల 13వ తేదీన విధుల్లో చేరారు.వివిధ రంగాల్లో ఈమె సేవలందిస్తూ సామాజిక సేవా కార్యకర్తగా గుర్తింపు పొందడంతో, ఆమె సేవలను గుర్తించి క్యాంపనియన్షిప్ కమ్యూనిటీ చేంజ్ మేకర్ అవార్డు -2025 కు ఎంపికయ్యారు. ఈనెల 19వ తేదీన విజయవాడ, తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవములో సంస్థ వ్యవస్థాపకులు షబ్బీర్, ఇతర ప్రతినిధులు చేతుల మీదుగా క్యాంపనియన్షిప్ కమ్యూనిటీ చేంజ్ మేకర్ జాతీయ అవార్డు -2025 ను డాక్టర్ షహనాజ్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ సేవలో ఇప్పటికే 5 ప్రపంచ రికార్డులు,14 జాతీయ అవార్డులు వచ్చినట్లు ఆమె తెలిపారు. ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.



పురస్కారం అందుకున్న షహనాజ్



మాట్లాడుతున్న విద్యార్థిని

విద్యార్థులకు ఉపన్యాస పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్‌లో హెచ్.ఎమ్. ఎస్.జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీరగాధలపై ఉపన్యాస,వ్యాసరచన పోటీలను నిర్వహించారు. మేజర్ సోమనాధ్ శర్మ, కెప్టెన్ కరమ్ సింగ్ ల జీవిత చరిత్రల గురించి విద్యార్థులు అనర్గళంగా ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, కుమారి, ఎస్.ఫాల్గుణరావు, వి.పద్మావతి, శ్రీదేవి, నాగేశ్వరరావు, అమ్మాజీ లు పాల్గొన్నారు.

కనక దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో కాగిత గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయ 16వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.మొదటి రోజు గ్రామానికి చెందిన రామాంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో ఏకాహం భజన కార్యక్రమం చేపట్టారు. పలు గ్రామాల నుండి వచ్చిన భజన సమాజ బృందాలు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఆలయ వార్షికోత్సవ సందర్భంగా బుధవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

గిరిజనులకు నష్టం జరగకుండా చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: మాడగడ, వనజాంగి ఎకో టూరిజం భూముల సర్వేపై సమీక్ష, పాత రికార్డులు పరిశీలించి, పక్కా ప్రణాళికతో రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారుఎకో టూరిజం ప్రాజెక్టుల వల్ల మాడగడ, వనజాంగి గ్రామస్తులు నష్ట పోకుండా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ నుండి సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ అంశంపై సమీక్షించారు. ఎకో టూరిజం కోసం మంజూరైన భూముల సర్వే గతంలో ఏ విధంగా జరిగిందనే దానిపై కలెక్టర్ ఆరా తీశారు.

బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సత్యనారాయణ - పలు గ్రామాల్లో నిరసనలు


నినాదాలు చేస్తున్న సత్యనారాయణ, రాజేష్, మత్స్యకారులు

ప్రజాశక్తి నక్కపల్లి :పర్యావరణానికి, మత్స్యకారుల జీవన ఉపాధికి నష్టం కలిగించే బల్క్ డ్రగ్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు జి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండలంలో చినతీనార్ల, దొండవాక గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి, బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో 38 రోజులుగా మత్స్యకారులు శాంతియుత రిలే దీక్షలు చేపడితే కూటమి ప్రభుత్వం, రాష్ట్ర హోంమంత్రి అనిత పట్టించుకోకుండా, కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటును ప్రజలందరూ వ్యతిరేకించారని, ప్రజా వ్యతిరేకతను పరిగణనలోకి తీసుకొని, ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కూడా సిమెంటు ఫ్యాక్టరీకి వ్యతిరేకమని ప్రకటించారని తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హెట్రో కంపెనీ కాలుష్యానికి వ్యతిరేకంగా మాట్లాడారని, మత్స్యకారులకు అండగా ఉంటామని భరోసా ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం అధికారంలో ఉన్న మీరు మత్స్యకారులు బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ చేస్తున్న పోరాటాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, మత్స్యకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో ఈ ప్రాంతంలో ఉన్నటువంటి మత్స్యకారులని అందరినీ ఐక్యం చేసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం రాజేష్, దొండవాక గ్రామానికి చెందిన మత్స్యకారులు పి లోకనాథం, కే.కొండబాబు, కే కాసులమ్మ, కే.దేముడు, పి.తాతారావు, చిన్నతీనార్ల గ్రామానికి చెందిన మత్స్యకారులు చొడిపల్లి జగ్గయ్యమ్మ, టి ముసలమ్మ, కే.రాజు, దుర్గమ్మ, ఎస్ రాములమ్మ, కే.అమ్మాజీ, ఎస్.రవణమ్మ పాల్గొన్నారు.

కొనసాగిన మత్స్యకారుల రిలే దీక్షలు

నక్కపల్లి:తమ జీవితాలను నాశనం చేసే బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలో మత్స్యకార గ్రామ మైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారుల తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. బల్క్ డ్రగ్ వద్దు- గ్రామం ముద్దు, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి - పొట్టలు కొట్టొద్దు అంటూ ఫ్లెక్సీలు పట్టుకొని మత్స్యకారులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సముద్రమే తమ జీవనాధారం అని, సముద్రాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. చేపల వేట తప్ప మరే వృత్తి తమకు తెలియదని, సముద్రాన్ని కలుషితం చేస్తే తమ బతుకులు బుగ్గిపాలు అవుతాయన్నారు. బల్క్ డ్రగ్ ను ఏర్పాటు చేస్తే తమ జీవన విధానం, ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. ఇటువంటి ప్రమాదకరమైన పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్ బాబు, పిక్కి తాతీలు, వై నాగేష్, బైరాగి రాజు, కోడా కాశీ రావు, వాసుపల్లి శివ, రాంబాబు, డి నానాజీ, సోమేశ్, జి స్వామి, కే వెంకటేష్, కాశీ, మాధవరావు, శ్రీను పాల్గొన్నారు.

హోంమంత్రి చెప్పినా పనులు ఆపలేదు...

బల్క్ డ్రగ్ పనులు నిలుపుదల చేస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత చెప్పినప్పటికీ పనులు ఆపలేదని మత్స్యకార నాయకులు మహేష్ బాబు, పలువురు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం పనిచేసే ప్రాంతాలకు వెళ్లి పనులు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. హోం మంత్రి చెప్పినా పట్టించుకోరా అని ఆవేదన వెలిబుచ్చారు. పనులు నిలుపుదల చేస్తామని చెప్పి, పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. తమ పోరాటం ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు.

పలు గ్రామాల్లో నిరసన

బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేపట్టిన ఉద్యమానికి, సంఘీభావం తెలుపుతూ నక్కపల్లి మండలంలో బంగారమ్మ పేట పెద్దతీనార్ల పంచాయతీ దొండవాక, పాయకరావుపేట మండలంలో పెంటకోట, ఎస్ రాయవరం మండలంలో రేవు పోలవరం లోను మత్స్యకారులు బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టారు. మత్స్యకారుల జీవన ఉపాధి, ఉనికిని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజయ్యపేట మత్స్యకారులు తలపెట్టిన ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.

మత్స్యకారుల పూజలు

నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట నుండి వలస వెళ్లిన మత్స్యకారులు బల్క్ డ్రగ్‌ను రద్దుచేసి గ్రామాన్ని కాపాడాలని కోణార్క్‌లో పూజలు చేశారు. గ్రామానికి చెందిన పలువురు మత్స్యకారులు ఈ ప్రాంతంలో వేట సాగకపోవడంతో ఒడిస్సా రాష్ట్రం కోణార్క్ వలస వెళ్లారు. బల్క్ డ్రగ్ ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేటలో 38 రోజుల నుండి మత్స్యకారులు రిలే దీక్షలు చేపట్టడంతో వారికి సంఘీభావంగా వలస వెళ్లిన మత్స్యకారులు కోణార్క్‌లో మంగళవారం గంగమ్మ తల్లికి, నూక తాతకు ప్రత్యేక పూజలు చేశారు. బల్క్ డ్రగ్‌ను రద్దు చేసి గ్రామాన్ని, ప్రజలను రక్షించాలని వేడుకున్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



విశాఖలో నివాళులర్పిస్తున్న సిపి, కలెక్టర్, అనకాపల్లిలో పోలీసు అమరుల కుటుంబాలతో కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొని,పోలీసు అమరుల స్మారక స్థూపం వద్ద స్మృతితి పరేడ్ పుష్ప గుచ్ఛాలు ఉంచి, గౌరవ వందనం సమర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు తమ ప్రాణాలను పణంగా పెట్టి, పోలీసులు నిరంతరం అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకోవడం, వారి కుటుంబాలకు అండగా ఉండడం అందరి బాధ్యత అన్నారు.

జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 191 మంది పోలీసు సిబ్బంది, అందులో ఐదుగురు రాష్ట్రానికి చెందినవారు విధి నిర్వహణలో వీరమరణం పొందారన్నారు. ప్రజల రక్షణలో ప్రాణాలర్పణకు వెనుకాడని వృత్తిగా పోలీసు సేవను గౌరవంగా భావించాలన్నారు. పోలీసు అమరుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఓపెన్ హౌస్‌లు, వ్యాస రచన పోటీలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి, పోలీసు సేవల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటివరకు అమరులైన పోలీసుల పేర్లను జిల్లా ఎఎస్పి ఎల్.మోహనరావు చదివి వినిపించారు. 10 మంది పోలీసు అమరవీరుల కుటుంబాలకు రూ.10వేలు చొప్పున నగదు చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో ఎఎస్పిలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, డిఎస్పిలు ఇ.శ్రీనివాసులు, ఎం.శ్రావణి, వి.విష్ణుస్వరూప్, పరిపాలనాధికారి సిహెచ్.తిలక్ బాబు, ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, బెండి వెంకటరావు, బాల సూర్యారావు, లక్ష్మి, రమేష్, పైడపు నాయుడు, వెంకట నారాయణ, అప్పలనాయుడు, ప్రేమ్ కుమార్, రామకష్ణ, మన్మధరావు, రమణమూర్తి, సంజీవరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : నగరంలోని బీచ్‌రోడ్డులో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీస్ అమరవీరులకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సిపి శంఖబ్రత బాగ్చి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ 1929 నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుంటూ వస్తున్నామని గుర్తుచేశారు. ఆ రోజు ప్రత్యేకతను వివరించారు. విధి నిర్వహణలో పోలీసుల పని తీరు ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా స్థానిక సీఐ జి రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు